సన్మానం



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి

ఘట్‌కేసర్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తుమ్మల నాగేశ్వరరావును ఘట్‌కేసర్ మండల రైతుబంధు కో ఆర్డినేటర్ కొంతం అంజిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిశారు. మంగళవారం మంత్రి నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. నాయకుల విన్నపం మేరకు మేడ్చల్ జిల్లాలోని తోటలు, పంట పొలాలను సందర్శిస్తానని హామీనిచ్చారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా కిసాన్ సంఘ్ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, సభ్యులు సురేందర్ రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస రాజు, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ



స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న కౌన్సిలర్ సంగీతప్రభాకర్‌రెడ్డి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్ యువకులు, విద్యార్థులకు మూడో వార్డు కౌన్సిలర్ బొక్క సంగీతప్రభాకర్‌రెడ్డి స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. మంగళవారం యువజన సంఘం సభ్యులకు సొంత డబ్బు రూ.25 వేల విలువగల క్రికెట్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్‌ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ రమేశ్, మాజీ వార్డు సభ్యులు జంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, మల్లేశ్, నర్సింహరెడ్డి, జయపాల్‌రెడ్డి, వినయ్, ప్రవీణ్‌రెడ్డి, డీజీ నాయక్, యువకులు పాల్గొన్నారు.

మూడేళ్లయినా.. మూలుగుతూనే..

- రైల్వే బ్రిడ్జిని ఎప్పటికి పూర్తి చేస్తారో..?
- కొత్త ప్రభుత్వంలోనైనా అడుగులు పడేనా?
- నిత్యం వాహనదారులకు తప్పని తిప్పలు
- ఇప్పటికైనా స్పందించాలంటున్న ప్రజలు

50శాతం పనులు కూడా పూర్తి కాలేదు



అసంపూర్తిగా రైల్వే బ్రిడ్జి

మేడ్చల్: మేడ్చల్ –గిర్మాపూర్ రోడ్డులోని మేడ్చల్ రైల్వే ట్రాక్ వద్ద నిర్మిస్తున్న అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతుండటంతో పలు గ్రామాల, కాలనీల ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్ల క్రితం పాలకులు ఏ మాత్రం ఆలోచించకుండా రైల్వే బ్రిడ్జి పనులను ప్రారంభించారు. రైల్వే గేట్ అవతలి వైపు మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కాలనీలు, మండలంలోని గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాలు, కాలనీలకు మేడ్చల్ నుంచి వెళ్లే ప్రధాన మార్గం ఇదే. ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేయకుండా గేటును తవ్వేసి బ్రిడ్జి పనులు మొదలుపెట్టారు. చిన్న అండర్ బ్రిడ్జి ఉండగా.. దాన్నే దారిగా చూపారు. అందులో నుంచి కేవలం ద్విచక్రవాహనాలు, ఆటోలు మాత్రమే వెళ్లే వీలు ఉంది. కార్లు, ఇతర వాహనాలు గ్రామాలు, కాలనీలకు వెళ్లాలంటే గౌడవెల్లి నుంచి రాయిలాపూర్ మీదుగా, లేదా డబీల్‌పూర్ మీదుగా రాయిలాపూర్ వరకు దాదాపు 10 కిలో మీటర్లు తిరిగి రావాలి. మేడ్చల్ నుంచి రాయిలాపూర్ దూరం 5 కిలో మీటర్లు ఉండగా బ్రిడ్జి నిర్మాణం వల్ల 10కిలో మీటర్లు ఎక్కువగా తిరిగి రావాల్సి వస్తోంది. బ్రిడ్జి నిర్మాణ ప్రారంభ సమయంలో సంవత్సరంలో పూర్తి చేస్తామని చెప్పినా మూడేళ్లు పూర్తయినా కేవలం 50శాతం పనులు కూడా పూర్తి చేయలేదు.

అవస్థలు పడుతున్న ప్రజలు

మేడ్చల్‌కు రావాలంటే వివిధ కాలనీలు, గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. జూనియర్ కళాశాల సమీపంలో వరద నీరు వెళ్లడానికి ఏర్పాటు చేసిన చిన్న అండర్ పాస్ బ్రిడ్జి నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. రైల్వే ట్రాక్ అవతలి భాగంలో రైల్వే కాలనీ, సరస్వతినగర్, ఎల్లమ్మతోట, మెట్రోలైన్, సీసీఐ కాలనీ, వడ్డెరబస్తీలు ఉన్నాయి. గిర్మాపూర్, బర్మాజీగూడ, రాయిలాపూర్, బండమాదారం, శ్రీరంగవరం గ్రామాలు ఉన్నాయి. అక్కడి నుంచి మేడ్చల్‌కు రావడానికి ఒక్కటే దారి ఉండటంతో నిత్యం చుట్టూ తిరిగి ప్రయాణం చేయాల్సి వస్తోంది. ద్విచక్రవాహనాలు ఉన్న వారు ఎలాగో అలా తిరుగుతున్నా మిగతా వారి ప్రయాణ ఖర్చు అధికం కావడంతో ఆర్థిక భారం పెరిగి ఇబ్బందులు పడుతున్నారు.



ట్రాఫిక్ జాంతో రైల్వే బ్రిడ్జి వద్ద నిత్యం వాహనదారుల దుస్థితి

గుండ్లపోచంపల్లి బ్రిడ్జి అంతే..

కండ్లకోయ జాతీయ రహదారి నుంచి గుండ్లపోచంపల్లికి వెళ్లే దారిలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రెండేళ్లు పూర్తయినా బ్రిడ్జి పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో మేడ్చల్‌కు ఇతర ప్రాంతాల నుంచి గుండ్లపోచంపల్లికి వెళ్లే వారు, మైసమ్మగూడ మల్లారెడ్డి కళాశాలలకు వెళ్లే విద్యార్థులు అయోధ్య చౌరస్తా మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తోంది. బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేయాలని అధికార, ప్రతిపక్షాల నాయకులు అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా, ధర్నాలు చేసినా ఫలితం మాత్రం శూన్యం.

వర్షం వస్తే చెరువే..

బ్రిడ్జి అసంపూర్తిగా ఉండటంతో కింద నుంచి రాకపోకలు సాగించడానికి మున్సిపాలిటీ తరఫున ఏడాదిగా రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సమయంలో జేసీబీలు ఏర్పాటు చేసి మట్టిని తవ్వించి ద్విచక్రవాహనాలు, కార్లు, వెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ తరఫున వసతి కల్పించినా అది తాత్కాలికమే కావడంతో పెద్దగా ఉపయోగపడటం లేదు. వర్షం పడితే బ్రిడ్జి పూర్తిగా నీటితో నిండిపోయి చెరువును తలపిస్తోంది.



వర్షం పడితే చెరువును తలపిస్తున్న బ్రిడ్జి(ఫైల్)

తడి పొడి చెత్తను వేరు చేయాలి

మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య



మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: తడి పొడి చెత్త, హానికరమైన చెత్తను వేరుచేసి చెత్తను సేకరించే వాహనంలో వేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని డ్వాక్రా భవనంలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ఘన పదార్థాల నిర్వాహణ, సామాజిక మరుగుదొడ్ల నిర్వాహణ, సెప్టిక్ ట్యాంక్ శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, తడి పొడి చెత్త వినియోగంపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ సాబేర్ అలీ, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ రమాదేవి, డ్వాక్రా మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడతామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు సాయినివాస్ కాలనీలో రూ.10 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న అంతర్గత మురుగు కాల్వ నిర్మాణ పనులను ఆయన స్థానిక కౌన్సిలర్ గూడురు సబితఆంజనేయులుగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు జావిద్, మహేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు



ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్న జేసీబీ

శామీర్‌పేట్: అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని శామీర్‌పేట రేంజ్ ఆఫీసర్ విజయభాస్కర్ అన్నారు. ఎండీ తహరుద్దీన్ ఖాదిల్ అనే వ్యక్తి మూడుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్ గ్రామ పరిధిలోని పూరిగుట్ట సమీపంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 120లో జేసీబీ సాయంతో భూమిని చదును చేస్తున్నాడు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు జేసీబీతో పాటు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ జరిపిన అధికారులు రూ.50 వేల జరిమానాతో పాటు వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్ వెంకటేశ్‌గౌడ్



టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ మల్లు రవి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వెంకటేశ్ గౌడ్

పోచారం: కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తొలి రోజుల్లోనే పోచారం మున్సిపల్ కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్‌గౌడ్ బీఆర్ఎస్‌ను వీడారు. అనంతరం టీపీసీసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ పార్టీ అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జి, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లు రవి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వెంకటేశ్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తుందన్న ఆశాభావంతో ఉన్నట్లు చెప్పారు. బీఆర్ఎస్‌తో స్థానిక సంస్థలు నిర్వీర్యంగా మారాయని, అందుకే విసుగుచెంది కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక మేడ్చల్ జిల్లా నుంచి కాంగ్రెస్‌లో ఇదే తొలి చేరిక అవుతుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉండటం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మాజీ వార్డు సభ్యుడు యు.వెంకటేశ్, నాయకులు శశిమోహన్, రాజేంద్ర నాయక్, సీహెచ్ ఓదేల్ కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

100 శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలి

మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నూటికి నూరు శాతం ఆస్తి పన్నులు వసూలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో ఆస్తి పన్నుల వసూళ్లపై బిల్‌కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో బిల్ కలెక్టర్లు తమకు కేటాయించిన వార్డుల్లో 100 శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలంతా సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి పాటుపడాలన్నారు.



సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, కమిషనర్ రాజేంద్రకుమార్

అనంతరం వివిధ వార్డుల్లో శానిటేషన్ పనుల వివరాలను సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, బిల్‌కలెక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



కీసరలో నిర్మించిన శ్రీహరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం

కీసర: మండల కేంద్రమైన కీసరలో మంగళవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు నూతనంగా నిర్మించిన శ్రీహరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా కొనసాగనున్నాయి. అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కీసర అయ్యప్ప భక్త మండలి సభ్యులు తెలిపారు. నిత్యం ప్రత్యేక పూజలు ఉంటాయని వారు అన్నారు.



అయ్యప్ప దేవాలయానికి విరాళం అందజేస్తూ..

రూ.2 లక్షల విరాళం అందజేత

కీసరలో నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయానికి కీసర గ్రామానికి చెందిన రాయిల కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమారులు రాయిల భాస్కర్‌గుప్తా, రాయిల పవన్‌కుమార్‌గుప్తా, రాయిల శ్రావన్‌కుమార్‌గుప్తా రూ.2 లక్షల నగదును మంగళవారం విరాళంగా అందజేశారు. అయ్యప్ప సేవాసమితి సభ్యులు నల్ల బాల్‌రెడ్డి, బొడుసు రమేష్, తటాకం లక్ష్మణ్, మొర్గ యాదగిరి, నరహరి పాల్గొన్నారు.

మహిళలపై హింసను అరికట్టాలి

శామీర్‌పేట్: మహిళలపై హింసను అరికట్టాలని మేడ్చల్ జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా సాధికారత కేంద్రం సమన్వయకర్త ప్రియాంక ఆధ్వర్యంలో మూడుచింతలపల్లి మండలం, కొల్తూర్ గ్రామంలోని బాలికల పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలికల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత అని, బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని తెలిపారు. బాల కార్మిక, పోక్సో, చైల్డ్ లైన్ చట్టాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కుల సంరక్షణ హెల్ప్‌లైన్ నంబర్– 100, 181, 1098, 14567 తదితర నంబర్ల ద్వారా ఫిర్యాదులు, సహాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ శిల్ప, జెండర్ స్పెషలిస్ట్ భార్గవి, సవిత, ఫైనాన్షియల్ లిటరసీ స్పెషలిస్ట్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



కొల్తూర్ పాఠశాలలో అవగాహన కార్యక్రమం

ఆర్టీసీ బస్సులు నడపాలని వినతి



మేనేజర్ చంద్రకాంత్‌కు వినతి అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్, బొక్కొనిగూడ, చందుపట్లగూడకు ఆర్టీసీ బస్సులు నడపాలని ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ బొక్క ప్రభాకర్‌రెడ్డి ఆర్టీసీ డిపో అధికారులకు మంగళవారం వినతి అందజేశారు. ఉప్పల్, చెంగిచెర్ల డిపోల నుంచి రెండేసి బస్సులు నడపాల్సిందిగా కుషాయిగూడ డిపో మేనేజర్ చంద్రకాంత్, చెంగిచెర్ల డిపో అసిస్టెంట్ మేనేజర్ ఆనంద్‌ను లేఖలో కోరారు. అలాగే ఎదులాబాద్ వెళ్లే బస్సులు చందుపట్లగూడకు గ్రామంలో నుంచి వెళ్లాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి, అవుషాపూర్ గ్రామంలోని ఇండియన్ బావార్చి హోటల్ సమీపంలో ఓ మృతదేహం ఉందని డయల్ 100కు సమాచారం అందింది. దీంతో ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు సుమారు 55 సంవత్సరాల వయస్సు గల వృద్ధుడిగా గుర్తించామని, ఆచూకీ కోసం ఎలాంటి ఆధారాలు లభించలేదని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామన్నారు.

కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మీ



జవహర్‌నగర్‌లో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న అధికారులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో ఎన్నికల కోడ్‌ను ఆసరాగా చేసుకొని నిర్మించిన అక్రమ కట్టడాలను కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మీ నేతృత్వంలో మంగళవారం సిబ్బందిచే కూల్చివేయించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మీ మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూముల్లో కబ్జాదారులు అక్రమ లేఅవుట్ చేస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అక్రమ కట్టడాలను కూల్చివేస్తామని, ఎవరినీ వదిలే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు స్మార్ట్ క్విజ్ పరికరం అందజేత



పాఠశాలకు పరికరాన్ని అందజేస్తున్న సీఎంఆర్‌సెట్ అధ్యాపకులు, విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ కళాశాల విద్యార్థుల బృందం రూపొందించిన స్మార్ట్ క్విజ్ బోర్డు పరికరాన్ని మంగళవారం మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందజేశారు. భారతదేశ పటం, రాష్ట్రాలు వాటి రాజధానులను విద్యార్థులు సులభంగా గుర్తించాలనే భావనతో కళాశాల అధ్యాపకులు సురేశ్ రామ్, రవికిరణ్, అఖిల పర్యవేక్షణలో సమీక్ష, రాహుల్, సాత్విక్, అరవింద్, బిందు విద్యార్థుల బృందం స్మార్ట్ క్విజ్ బోర్డు పరికరాన్ని తయారుచేశారు. ఈ పరికరం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మంజుల, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపినాథ్ ముండే జయంతి

మేడ్చల్: దివంగత వంజరి సంఘం నేత, మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి గోపినాథ్ ముండే జయంతిని మేడ్చల్‌లో వంజరి సంఘం నాయకులు నిర్వహించారు. పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద ముండే చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వంజరి సంఘం నాయకులు నర్సింహం, వంశీవంజరి, లక్ష్మణ్, రాజు, శ్రీనివాస్, సన్నీకుమార్ ఉన్నారు.



ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులదే..

రెవెన్యూ అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులు తప్పకుండా తీసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్నిరకాల సహకారం అధికార యంత్రాంగం నుంచి ఉంటుందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, తహసీల్దార్లు తమ విధులను సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి తహసీల్దార్లతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఇతరుల స్వాధీనంలో ఉన్నట్లయితే.. వెంటనే నోటీసులు జారీచేసి వాటిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. జిల్లాలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయనే వివరాలను తెలుసుకుని, వాటిని ఎవరైనా కబ్జా చేసినట్లయితే వెంటనే పోలీసు బలగాలతో సంబంధిత ప్రదేశంలోని ప్రభుత్వ భూమి అని సూచించేలా బోర్డు ఏర్పాటు చేయటంతో పాటు కంచె ఏర్పాటు చేయాలని తహసీల్దార్లకు ఆయన సూచించారు.

సమగ్ర సమాచారంతో..

ప్రభుత్వ భూములను కబ్జా చేసిన ఆక్రమణదారులు ఇబ్బందులకు గురిస్తే చేస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. రెవెన్యూ అధికారులతో 15 రోజులకోసారి అన్ని విషయాలపై సమీక్ష సమావేశాలు ఉంటాయని, ప్రభుత్వ భూములపై సమగ్ర సమాచారంతో ఉండాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్లు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, సానుకూలంగా స్పందించి, పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ అధికారులకు అన్ని విషయాల్లో అండగా ఉంటామని భరోసా కల్పించారు. ప్రభుత్వ సూచనలు పాటిస్తూ తమ విధులు సక్రమంగా నిర్వర్తించి ప్రభుత్వ భూములు ఆక్రమించకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీవోలు రాజేష్ కుమార్, శ్యామ్ ప్రకాశ్, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు అదృశ్యం



జోసెఫ్ ఆంటోని(ఫైల్)



నందిని(ఫైల్)



లక్ష్మీ(ఫైల్)

జవహర్‌నగర్: వేర్వేరు ఘటనల్లో ముగ్గురు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్‌కు చెందిన జోసెఫ్ ఆంటోని(35) ఈ నెల 1వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు.

మరో ఘటనలో..

కౌకూర్ రాజీవ్ గృహకల్పలో నివసించే నందిని(28) ఈ నెల 9వ తేదీన ట్యూషన్ చెప్పడానికి అని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దమ్మాయిగూడ న్యూభవానీనగర్‌లోని మానస రిక్రియేషన్ సెంటర్ నుంచి మతిస్థిమితం లేని మహిళ లక్ష్మీ(47) ఈ నెల 9వ తేదీన బయటకు వెళ్లి అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు, రిక్రియేషన్ సెంటర్ నిర్వాహకులు తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మారుతి మిత్రమండలి ఆధ్వర్యంలో అన్నదానం

కుషాయిగూడ: అమావాస్య సందర్భంగా కుషాయిగూడ మారుతీ మిత్రమండలి ఆధ్వర్యంలో మంగళవారం కుషాయిగూడ పోచమ్మ ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. తమవంతుగా సేవా కార్యక్రమాలు చేపట్టాలనే సంకల్పంతో అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రతి అమావాస్య రోజు అన్నదానం చేస్తామని సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కుషాయిగూడ వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ సంకూరి శ్రీనివాస్‌గౌడ్, మిత్రమండలి ప్రతినిధులు సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, హనుమంతు, అశోక్‌చారి, బాబు, వెంకట్‌రెడ్డి, సతీష్, శ్రీనివాస్‌యాదవ్, చక్రపాణిగౌడ్, జనార్ధన్, గోపాల్‌చారి, వేణు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్‌లో సత్తాచాటిన లయోల విద్యార్థులు

అల్వాల్: గోల్కొండలోని ఆర్టీ సెంటర్ స్టేడియంలో ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన టోర్నమెంట్‌లో లయోలా అకాడమీ విద్యార్థులు చురుగ్గా పాల్గొని అనేక పతకాలు, ట్రోఫీలను గెలుచుకున్నారు. అకాడమీ అథ్లెట్లను ప్రిన్సిపాల్ ఫాదర్ ఎల్.జోజిరెడ్డి ఎస్‌జే, వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ ఎ ఎమ్ జోసెఫ్‌కుమార్ ప్రసంశలు తెలిపారు. రాబోయే టోర్నమెంట్స్‌కి మంచి ఫిట్నెస్‌తో సత్తా చాటాలని ఆయన అన్నారు.



టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చిన లయోలా విద్యార్థులు

శానిటేషన్ సిబ్బందికి సహకరించాలి

కుషాయిగూడ: నిత్యం ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చుకుంటూ విధులు నిర్వర్తించే శానిటేషన్ సిబ్బందికి సహకరించాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. జీహెచ్ఎంసీ అందజేసిన శానిటేషన్ కిట్స్‌ను మంగళవారం ఆమె సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో వందశాతం స్వచ్ఛత సాధించే దిశగా పనిచేయాలన్నారు. సమష్టి కృషితోనే సాధ్యమవుతుందని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ సహకారం అందజేయాలన్నారు. శానిటేషన్ కిట్స్‌ను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, పాండాల శివకుమార్‌గౌడ్, నారెడ్డి రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.